క్లుప్తంగా

శ్రీ మద్దిలేటి నరసింహ స్వామికి శ్రావణమాసపూజలు



వెండి సహస్రధార పాత్రలను అందజేస్తున్న దాతలు

బేతంచెర్ల : మండల పరిధిలోని ఆర్‌ఎస్‌ రంగాపురం శివార్లో వెలసిన శ్రీలక్ష్మీ గణమద్దిలేటి నరసింహస్వామికి నిజ శ్రావణ మాసం మొదటి శనివారం పురస్కరించుకుని ప్రత్యేక పూజలు చేశారు. వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన వేకువజాము నుండే ఆలయ పుష్కరిణిలో పుణ్యస్నానాలు ఆచరించి స్వామి వార్లకు అభిషేకం, కుంకుమార్చన, వరపూజ, ఆకుపూజ నిర్వహించారు. భక్తుల వివిధ సేవల ద్వారా రూ.5,58,450 ఆదాయం వచ్చినట్లు ఈఓ పాండు రంగారెడ్డి, చైర్మన్‌ రామచంద్రుడు తెలిపారు. నంద్యాల జిల్లా, గోస్పాడు మండలం, కానాల గ్రామానికి చెందిన కొల్లి చంద్రశేఖర్‌ రెడ్డి. ఈశ్వరమ్మ దంపతులు స్వామి, అమ్మవార్లకు రూ.1.80 లక్షల విలువ 2.47 కేజీల వెండి సహస్రధార పాత్రలు అందజేశారు. స్వామి, అమ్మవార్ల ప్రత్యేక పూజల అనంతరం దాతలకు తీర్థ ప్రసాదాలు అందజేసి సత్కరించారు. ఈనెల 29న స్వామి, అమ్మవార్ల హుండీ లెక్కింపు నిర్వహిస్తున్నట్లు ఆలయ ఈఓ, చైర్మన్‌ తెలిపారు.

మెరుగైన వైద్య సేవలు అందించండి



వైద్యులు, గ్రామస్తులతో మాట్లాడుతున్న ఎంపీపీ

బేతంచెర్ల: రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని ఎంపీపీ బుగ్గన నాగభూషణం వైద్య సిబ్బందికి సూచించారు. శనివారం మండల పరిధిలోని రంగాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఎంపీపీ బుగ్గన నాగభూషణం రెడ్డి, ఎంపీడీఓ వెంగన్న, గ్రామ సర్పంచ్‌ గుమ్మగాల్ల రాజు, మాజీ సర్పంచ్‌ జగన్‌ మోహన్‌ రెడ్డిలు సందర్శించారు. ఈ సందర్భంగా రోగులకు అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. వైద్య సిబ్బందితో సమస్యలపై చర్చించారు. అనంతరం ప్రక్కన్న ఉన్న గ్రామ సచివాలయ భవన నిర్మాణాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో మద్దిలేటి స్వామి ఆలయ చైర్మన్‌ రామచంద్రుడు, ఎంపీటీసీ నాగ శేషు, గోరుమానుకొండ సర్పంచ్‌ వెంకటేశ్వర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు గూని నాగరాజు, తిరుమలేశ్వర్‌ రెడ్డి, తిమోతి, సత్యం రెడ్డి, ఎద్దులన్న పాల్గొన్నారు.

బాధ్యతలు స్వీకరించిన సీఐ సుధాకర్‌ రెడ్డి



ప్యాపిలి: స్థానిక సర్కిల్‌ కార్యాలయంలో నూతన సీఐగా సుధాకర్‌ రెడ్డి శనివారం బాధ్యతలు తీసుకున్నారు. గతంలో ఇక్కడ పని చేస్తున్న శ్రీరాములు ఎస్పీ కార్యాలయానికి వెళ్లారు. నందికొట్కూరు నుంచి బదిలీపై వచ్చిన సీఐ విధుల్లోకి చేరారు. సీఐని వైఎస్సార్‌సీపీతోపాటు వివిధ పార్టీల, ప్రజాసంఘాల నాయకులు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణకు అన్ని పార్టీల నాయకులు, ప్రజా సంఘాలు సహకరించాలన్నారు.

ఎస్పీని కలిసిన సీఐ

బొమ్మలసత్రం: ప్యాపిలి సీఐగా బాధ్యతలు స్వీకరించిన జీ.సుధాకర్‌రెడ్డి శనివారం జిల్లా ఎస్పీ రఘువీర్‌రెడ్డిని స్థానిక కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. నందికొట్కూరు రూరల్‌ సీఐగా విధులు నిర్వహిస్తున్న ఆయన సాధారణ బదిలీల్లో భాగంగా ప్యాపిలి సీఐగా బదిలీ అయ్యారు. బాధ్యతల స్వీకరణ అనతంరం ఆయన ఎస్పీని కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.

ఘనంగా మహా గణపతి విగ్రహ ప్రతిష్ఠ



హోమం నిర్వహిస్తున్న దృశ్యం


ప్యాపిలి: పట్టణంలోని క్రిందిగేరిలో వెలసిన రామలింగేశ్వర స్వామి ఆలయంలో శనివారం శిఖర కలశ స్థాపన, మహా గణపతి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమం శనివారం ఘనంగా నిర్వహించారు. ఉదయాన్నే గణపతి పూజ, పుణ్యాహవాచనం, నవగ్రహ, వాస్తు పురుష, ఉమా మహేశ్వర పూజ, హోమం నిర్వహించారు. అనంతరం కలశ స్థాపన, మహామంగళ హారతి తదితర పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో అర్చకులు నరేశ్‌ కుమార్‌, కంచి రాం ప్రతాప్‌ స్వామి తదితరులు పాల్గొన్నారు.

అంకితభావంతో విధులు నిర్వర్తించాలి

● ప్రిన్సిపాల్‌ సెక్రటరీ ప్రవీణ్‌ప్రకాష్‌



కస్తూర్బా పాఠశాలను తనిఖీ చేస్తున్న ప్రిన్సిపాల్‌ సెక్రటరీ ప్రవీణ్‌ప్రకాష్‌



జీఈఆర్‌ సర్వేను పరిశీలిస్తున్న ప్రిన్సిపాల్‌ సెక్రటరీ

కొలిమిగుండ్ల: ప్రభుత్వ ఉద్యోగులు కింది స్థాయి నుంచి ఉన్నతాధికారుల వరకు బాధ్యతాయుతంగా అంకితభావంతో విధులు నిర్వర్తించాలని, అప్పుడే వ్యక్తిగతంగా, ప్రభుత్వానికి మంచి పేరు వస్తుందని విద్యాశాఖ ప్రిన్సిపాల్‌ సెక్రటరీ ప్రవీణ్‌ ప్రకాష్‌ పేర్కొన్నారు. మండల కేంద్రం కొలిమిగుండ్లలోని కస్తూర్బా పాఠశాలను శనివారం రాత్రి ఆయన తనిఖీ చేశారు. దాదాపు గంటపాటు పాఠశాల సిబ్బంది, విద్యార్థులతో చర్చించారు. డిజిటల్‌ క్లాస్‌ల కోసం ఏర్పాటు చేసిన ఐఎఫ్‌పీ ప్యానెళ్లకు విద్యుత్‌ సౌకర్యం ఇవ్వక పోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రభుత్వం కోట్లాది రూపాయలు ఖర్చు చేసి విద్యాభివృద్ధికి కృషి చేస్తుంటే నిర్లక్ష్యంగా వ్యవహరించడం తగదన్నారు. తక్షణమే విద్యుత్‌ ఏర్పాటు చేసి డిజిటల్‌ తరగతులు ప్రారంభించాలని ఆదేశించారు. ఉపాధ్యాయులను సబ్జెక్టుల వారీగా వివరాలు తెలుసుకొని ఎవరెవరు ఎన్ని పాఠాలు బోధిస్తున్నారనే విషయాలపై ఆరా తీశారు. అదేవిధంగా ఎంత మంది విద్యార్థులు ఆ పాఠాలను పూర్తి చేశారని ప్రశ్నించారు. ట్యాబ్‌ల పనితీరుపై వివరాలు సేకరించారు. పదో తరగతి ఫలితాల్లో చాలా తక్కువ మంది ఉత్తీర్ణత కావడంపై అసహనం వ్యక్తం చేశారు. ఇలా అయితే వంద శాతం ఫలితాలు ఎలా సాధ్యమవతుందని ప్రశ్నించారు. ఉపాధ్యాయులు పనితీరు మార్చుకోవాలని హెచ్చరించారు. నాడు–నేడు పనుల పురోగతిని అడిగి తెలుసుకున్నారు. అనంతరం గ్రామ సచివాలయం చేరుకున్నారు. సిబ్బంది మండల కేంద్రాల్లో కాకుండా ఇతర ప్రాంతాల నుంచి విధులకు హాజరు అవుతున్నారని తెలియడంతో ఎంపీడీఓ ప్రసాద్‌రెడ్డికి ఫోన్‌లో క్లాస్‌ పీకారు. అదేవిధంగా ఈవిషయంపై జిల్లా కలెక్టర్‌తో ఫోన్‌లో చర్చించారు.

జీఈఆర్‌ సర్వేపై ఆరా

బడి ఈడు పిల్లలంతా బడిలో ఉండేందుకు చేస్తున్న జీఈఆర్‌ సర్వేపై ప్రిన్సిపాల్‌ సెక్రటరీ ప్రవీణ్‌ప్రకాష్‌ ఆరాతీశారు. వలంటీర్లు మొబైల్‌ యాప్‌లో చేస్తున్న ఈసర్వే అంశాలను పరిశీలించారు. ఓ విద్యార్థి పదో తరగతి పాసై ఇంటర్‌ మొదటి సంవత్సరంలో మానేసినట్లు నమోదు చేశారు. దీనిపై ఏకంగా విద్యార్థిని తల్లితండ్రులకు అక్కడి నుంచే ఫోన్‌ చేసి వివరాలు ఆరాతీశారు. మా అమ్మాయి పదో తరగతిలో రెండు సబ్జెక్టులు ఫెయిల్‌ కావడంతో ఇంటి వద్ద ఉంచామని విద్యార్థిని తల్లిదండ్రులు వివరించడంతో వలంటీర్‌ పనితీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు. వలంటీర్లపై ఎంతో నమ్మకం పెట్టుకున్నామని, ఇలా తప్పులు నమోదు చేయడం సరికాదని సూచించారు. ఇప్పటికైనా పద్ధతులు మార్చుకోవాలని హెచ్చరించారు. జీఈఆర్‌ సర్వేలో తప్పులు దొర్లితే తన ఉద్యోగానికి రాజీనామా చేస్తానని సవాల్‌ విసిరిన విషయాన్ని ఈ సందర్భంగా ప్రిన్సిపాల్‌ సెక్రటరీ గుర్తు చేశారు.

షాదీతోఫా సొమ్ము అందజేత



నగదు అందజేస్తున్న దృశ్యం

డోన్‌ టౌన్‌ : పట్టణంలోని 16వ వార్డు సచివాలయ పరిధిలో నివాసముంటున్న మున్నిబేగం, రజాక్‌ దంపతుల కుమార్తె షేక్‌ మైమూని వివాహం కొన్ని నెలల కిందట జరిగింది. ప్రభుత్వం పెళ్లి కానుకలో భాగంగా అందజేస్తున్న షాదీతోఫా మంజూరైంది. ఈ మేరకు షాదీతోఫా నగదును లబ్ధిదారులకు కౌన్సిలర్‌ మేకల విమల, సచివాలయ కన్వీనర్‌ వడ్డే రంగస్వామి, వైఎస్సార్‌సీపీ నాయకులు మేకల రాజు అందజేశారు.

28న ఆహా క్యాంటిన్‌ ప్రారంభోత్సవం

డోన్‌ టౌన్‌ : స్థానిక పాత బస్టాండ్‌లో ఈ నెల 28వ తేదీన ఆహా క్యాంటిన్‌ ప్రారంభిస్తున్నట్లు మున్సిపల్‌ కమిషనర్‌ వెంకట్రామిరెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. డోన్‌ మున్సిపల్‌ మెప్మా వారి ఆధ్వర్యంలో ఆహా క్యాంటిన్‌ నిర్వహించడానికి సర్వ సిద్ధం చేశామన్నారు. సోమవారం ఆహా క్యాంటిన్‌ను మున్సిపల్‌ చైర్మన్‌ సప్తశైల రాజేష్‌ చేతుల మీదుగా ప్రారంభించనున్నట్లు తెలిపారు.

లోక్‌ అదాలత్‌లో సత్వర న్యాయం

● సీనియర్‌ సివిల్‌ జడ్జి తంగమణి



సమావేశం నిర్వహిస్తున్న జడ్జి తంగమణి

డోన్‌ టౌన్‌ : లోక్‌ అదాలత్‌ ద్వార కక్షిదారులకు సత్వర న్యాయం జరుగుతుందని సీనియర్‌ సివిల్‌ జడ్జి, మండల లీగల్‌ సర్వీసు కమిటీ చైర్మన్‌ తంగమణి అన్నారు. సెప్టెంబరు 9వ తేది డోన్‌లో నిర్వహించే మెగా లోక్‌ అదాలత్‌పై శనివారం స్థానిక ఆర్‌ అండ్‌ బీ గెస్ట్‌ హౌస్‌లో డోన్‌ కోర్టు పరిధిలోని పోలీసు అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డోన్‌ కోర్టు పరిధిలోని పోలీస్‌ స్టేషన్లకు సంబంధించి పెండింగ్‌ కేసులపై జడ్జి చర్చించారు. అనతంరం ఆమె మాట్లాడుతూ కక్షిదారులు రాజీ అయితే లోక్‌ ఆదాలత్‌లో ప్రవేశ పెట్టాలని సూచించారు. క్షణికావేశం, పట్టింపుల మూలంగా పోలీసు స్టేషన్లకు వచ్చి కేసులు పెట్టి కోర్టుల చుట్టూ తిరుగుతూ సమయం, డబ్బు వృథా చేసుకోకుండా రాజీ మార్గాన్ని ఎంచుకునేలా చైతన్య పరచాలన్నారు. మెగా లోక్‌ అదాలత్‌ గురించి కక్షిదారులకు సమాచారం ఇవ్వడంతో పాటు వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకునేలా పోలీసులు కృషి చేయాలన్నారు. కక్షిదారులను బలవంతంగా రాజీ చేయకూడదన్నారు. సమావేశంలో ఫస్ట్‌క్లాస్‌ మేజిస్ట్రేట్‌ హనీషా, డోన్‌ డీఎస్పీ శ్రీనివాసరెడ్డి, పట్టణ సీఐ ప్రవీణకుమార్‌, ఎస్‌ఐలు శరత్‌ కుమార్‌రెడ్డి, నగేష్‌, సుధాకర్‌ రెడ్డి, న్యాయవాదులు తదితరులు పాల్గొన్నారు.

మదర్‌ థెరిసా జయంతి

బేతంచెర్ల: మండల పరిధిలోని గోర్లగుట్ట ప్రాథమికోన్నత పాఠశాలలో శనివారం విశ్వమాతగా పేరు గాంచిన మదర్‌ థెరిసా జయంతిని ఘనంగా నిర్వహించారు. ఆమె చిత్ర పటానికి ఇంచార్జి హెచ్‌ఎం ఫర్హత్‌ జహాన్‌, ఉపాధ్యాయులు మారుతి దేవి, నసీమ, శివ కుమారస్వామి, వరలక్ష్మి, మురళీ, రంగస్వామి తదితరులు పూలమాల వేసి నివాళులర్పించారు. మదర్‌ థెరిసా సమాజానికి చేసిన సేవలను ఈ సందర్భంగా హెచ్‌ఎం గుర్తు చేశారు.

చికిత్స పొందుతూ కోలుకోలేక వ్యక్తి మృతి

అవుకు: మండల పరిధిలోని రామాపురం గ్రామంలో ఈ నెల 18వ తేదీన ఓ ఇంట్లో గ్యాస్‌ లీక్‌ అయ్యి ముగ్గురికి గాయాలు అయిన విషయం తెలిసిందే. క్షతగాత్రులు కర్నూలు ప్రభుత్వ ఆసుపత్రికి చికిత్స పొందుతున్నారు. అయితే మొగ్గ కంబగిరి(60) కోలుకోలేక శనివారం మృతి చెందాడని ఎస్‌ఐ నరేంద్ర కుమార్‌ తెలిపారు. మృతుని కుమార్తె దస్తగిరమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని ఎస్‌ఐ తెలిపారు.

జీపుజాతను విజయవంతం చేయాలి

కోవెలకుంట్ల: సీపీఐ ఆధ్వర్యంలో నిర్వహించ తలపెట్టిన జీపుజాతను విజయవంతం చేయాలని ఏఐటీయూసీ జిల్లా ఆర్గనైజింగ్‌ సెక్రటరీ శివబాలకృష్ణ పిలుపునిచ్చారు. శనివారం కోవెలకుంట్లలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఈ నెల 28,29వ తేదీల్లో బనగానపల్లె, ఆళ్లగడ్డ నియోజకవర్గాల్లోని ఆయా మండలాల్లో జీపుజాత కొనసాగుతుందన్నారు. కార్యక్రమంలో నాయకులు బాష, గోపాలకృష్ణ, కుళాయిస్వామి, తదితరులు పాల్గొన్నారు.

వర్షం.. హర్షం



కోవెలకుంట్లలో వర్షం కురుస్తున్న దృశ్యం

కోవెలకుంట్ల: ఈ ఏడాది ఖరీఫ్‌ సీజన్‌ ప్రారంభమై మూడు నెలలు కావస్తున్నా ఇప్పటి వరకు ఆశించిన స్థాయిలో వర్షాలు కురియలేదు. శనివారం ఉదయం నుంచి ఉక్కపోతగా ఉండి సాయంత్రం వాతావరణంలో ఒక్కసారిగా మార్పులు చోటు చేసుకుని కోవెలకుంట్ల వ్యవసాయ సబ్‌ డివిజన్‌లోని పలు మండలాల్లో మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. కోవెలకుంట్ల, సంజామల, ఉయ్యాలవాడ, దొర్నిపాడు మండలాల్లో వర్షం పడటంతో రైతులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. సబ్‌ డివిజన్‌లో రైతులు పత్తి, మిరప, కంది, మినుము, పెసర, మొక్కజొన్న తదితర పంటలు సాగు చేశారు. వర్షం లేక పైర్లు ఎండిపోతున్న తరుణంలో వరణుడు కరుణించడంతో రైతులుఊరట చెందుతున్నారు.

మంచినీటి సమస్య లేకుండా చర్యలు

● జెడ్పీ చైర్మన్‌ ఎర్రబోతుల పాపిరెడ్డి



ఓవర్‌ ట్యాంక్‌ నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న జెడ్పీ చైర్మన్‌ ఎర్రబోతుల పాపిరెడ్డి

కొలిమిగుండ్ల: గ్రామాల్లో భవిష్యత్‌లో సైతం మంచి నీటి సమస్య తలెత్తకుండా అన్నీ చర్యలు తీసుకుంటున్నామని జెడ్పీ చైర్మన్‌ ఎర్రబోతుల పాపిరెడ్డి పేర్కొన్నారు. మండల పరిధిలోని పెట్నికోటలో జల్‌జీవన్‌ మిషన్‌ పథకం కింద రూ.70.50 లక్షలతో నిర్మించనున్న 1.50 లక్షల లీటర్ల సామర్థ్యం ఓవర్‌హెడ్‌ ట్యాంక్‌ నిర్మాణానికి శనివారం జెడ్పీ చైర్మన్‌ భూమి పూజ చేశారు. ట్యాంక్‌ నిర్మాణానికి స్థలాన్ని విరాళంగా ఇచ్చిన గ్రామానికి చెందిన గొంగటి నారాయణరెడ్డితోపాటు కుటుంబ సభ్యులను ఆయన అభినందించారు. ఈ సందర్భంగా జెడ్పీ చైర్మన్‌ మాట్లాడుతూ బనగానపల్లె నియోజకరవర్గంలో గతంలో ఎన్నడూ లేని రీతిలో తాగునీటి పథకాల కోసం దాదాపు రూ.70 కోట్ల కేటాంచి చేపట్టిన పనులు చురుగ్గా సాగుతున్నాయన్నారు. దశాబ్దాల తరబడిగా చాలా గ్రామాల్లో శాశ్వత మంచినీటి పథకాలు లేక ప్రజలు వేసవిలో చాలా ఇబ్బందులు పడేవారన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం వచ్చాక ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి సహకారంతో నియోజవర్గానికి పెద్ద ఎత్తున నిధులు మంజూరు చేయించామన్నారు. ఇప్పటికే చాలా గ్రామాల్లో మొదటి విడతలో చేపట్టిన ఓవర్‌హెడ్‌ ట్యాంక్‌ నిర్మాణాలు పూర్తయ్యాయని చెప్పారు. కొద్ది రోజుల్లో ప్రతి ఇంటికీ కుళాయి కనెక్షన్‌ ఏర్పాటు చేస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్‌ ఏఈ సుబ్రహ్మణ్యం, గ్రామ నాయకులు సోమశేఖర్‌రెడ్డి, వెంకట్రామిరెడ్డి, శివారెడ్డి, పుల్లారెడ్డి, యర్రగుడి వెంకటేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వర్షం కోసం పూజలు



పెద్దరాజుపాలెం వీధుల్లో భజన చేస్తున్న దృశ్యం

బనగానపల్లెరూరల్‌: వరుణుడి కరుణ కోసం గ్రామాల్లో ప్రజలు పూజలు చేస్తున్నారు. ఈ మేరకు శనివారం మండలంలోని పసుపల గ్రామ భజన సంఘం సభ్యులు భజన చేశారు. తెల్లవారుజామున ఉదయం పసుపల గ్రామం నుంచి ప్రారంభమైన ఈ భజన పెద్దరాజుపాళెం, మంగంపేట, క్రిష్ణగిరి చిన్నరాజు పాళెం గ్రామాల్లో వరుణదేవుడి పై భక్తిగీతాలు పాడుకుంటూ సాగింది. రాత్రి తిరిగి పసుపల చేరుకుని ఆంజనేయస్వామి దేవాలయం చేరుకున్నారు. ఆయా గ్రామాల్లో పలువురు ఇచ్చిన నిత్యావసర సరుకులతో నైవేద్యం తయారు చేసి ఆంజనేయ స్వామికి సమర్పించారు. అనంతరం భక్తులకు ప్రసాదం పంపిణీ చేశారు. కార్యక్రమంలో భజన సంఘం సభ్యులు ఓబులేష్‌యాదవ్‌,సురేష్‌ నాయుడు, రాజునాయుడు, శ్రీరాములు, కంబగిరి,నాయుడు, రాజేష్‌, రామచంద్రుడు తదితర గ్రామస్తులు పాల్గొన్నారు.

బేతంచెర్ల: వర్షం కోసం మండల పరిధిలోని బలపాలపల్లె గ్రామస్తులు శనివారం ప్రత్యేక పూజలు చేశారు. ఖరీఫ్‌లో సాగు చేసిన పంటలు ఎండిపోతుండడంతో గ్రామ రైతు సంఘం ఆధ్వర్యంలో గ్రామస్తులు కొండ సమీపానున్న నేరడు వృక్షం వద్దకు ఎడ్లబండ్లలో వెళ్లారు. వృక్షానికి ప్రత్యేక పూజలు చేసి వరుణుడు కరుణించాలని వేడుకున్నారు.

మినరల్‌ వాటర్‌ ప్లాంట్ల ఏర్పాటుకు స్థల పరిశీలన

కొలిమిగుండ్ల: పోతిరెడ్డి రామసుబ్బారెడ్డి సేవా ట్రస్ట్‌ ఆధ్వర్యంలో మినరల్‌ వాటర్‌ ప్లాంట్ల ఏర్పాటు కోసం శనివారం బందార్లపల్లె క్రాస్‌ రోడ్డులోని రాయల్టీ చెక్‌ పోస్ట్‌ కార్యాలయం వద్ద స్థలాన్ని ట్రస్ట్‌ చైర్మన్‌ పోతిరెడ్డి వెంకటసుబ్బారెడ్డి పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతు రాయల్టీ చెక్‌పోస్టు సమీపం, తిమ్మనాయినపేట జంక్షన్‌లో ప్రజల సౌకర్యం కోసం ఉచిత మినరల్‌ వాటర్‌ ప్లాంట్ల నిర్మాణం త్వరలోనే ఏర్పాటు చేయనున్నట్లు ఆయన తెలిపారు. రెండు చోట్ల స్థల పరిశీలన పూర్తి చేశామని, త్వరలోనే వాటర్‌ ప్లాంట్లు ఏర్పాటు చేపడుతామని పేర్కొన్నారు.

ఓటర్‌ బాబితాను పూర్తిస్థాయిలో విచారించాలి



మాట్లాడుతున్న ఆర్డీఓ వెంకట రెడ్డి

బేతంచెర్ల: ఇంటింటి ఓటర్‌ సర్వే అందరి సహకారంతో 100 శాతం పూర్తి చేయడం అభినందనీయమని ఆర్డీఓ వెంకట రెడ్డి పేర్కొన్నారు. శనివారం స్థానిక తహసీల్దార్‌ కార్యాలయంలో తహసీల్దార్‌ నరేంద్ర నాథ్‌రెడ్డి ఆధ్వర్యంలో బూత్‌ లెవల్‌ అధికారులు, సూపర్‌ వైజర్లతో నిర్వహించిన సమావేశంలో ఆర్డీఓ మాట్లాడారు. తొలగింపుల జాబితాను క్షేత్ర స్థాయిలో విచారించడమే కాకుండా, పొరపాటున తొలగించి ఉంటే ఓటర్‌ నమోదుకు ఫారమ్‌ –6 ఇవ్వాలన్నారు. ముఖ్యంగా ఒకే ఇంటినంబర్‌పైన 10 కిపైన ఓటర్లు, వందేళ్లు నిండిన ఓటర్లు ఉన్నా పూర్తి స్థాయిలో విచారించాలన్నారు. ఒకే ఇంటిపై పదిన ఓటర్లు ఉంటే ఎన్నికల కమిషన్‌ దృష్టికి బోగస్‌ ఓటర్లు ఉన్నట్లుగా వెళ్తుందని, సస్పెండ్‌ అవ్వడమే కాకుండా క్రిమనల్‌ కేసులు నమోదు చేయడం జరుగుతుందన్నారు. మరణించిన, తొలగించిన, డబుల్‌ ఎంట్రీ ఓటర్లను బాధ్యతగా విచారించాలన్నారు. ఒకే ఇంటిలో ఉన్న ఓటర్లందరూ ఒకే పోలింగ్‌ బూత్‌లో ఓటు వేసేలా చూడాలన్నారు. కార్యక్రమంలో నగర పంచాయతీ కమిషనర్‌ రమేష్‌ బాబు, ఈఓఆర్డీ వెంకట రంగనాయకులు, ఆర్‌ఐ శ్రీదేవి పాల్గొన్నారు.

యాజమాన్య పద్ధతులు పాటించాలి



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్‌ సరళమ్మ

బేతంచెర్ల: ప్రస్తుతం సరైన వర్షాలు లేనందున పంటలను బెట్ట నుంచి కాపాడుకునేందుకు యజమాన్య పద్ధతులు పాటించాలని నంద్యాల జిల్లా ఏరువాక కేంద్రం సమన్వయకర్త డాక్టర్‌ సరళమ్మ, విస్తరణ శాస్త్రవేత్త ప్రసాద్‌బాబు సూచించారు. పట్టణంలోని రైతు భరోసా కేంద్రంలో శనివారం డీఆర్‌ఏసీ ఏఓ ప్రభావతమ్మ, ఏఈ కిరణ్‌ కుమార్‌ ఆధ్వర్యంలో రైతులకు ఒక్క రోజు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. పత్తి, కొర్ర, కంది, ప్రొద్దుతిరుగుడు పంటలను ప్రస్తుతం వర్షాభావ పరిస్థితులనుంచి(బెట్ట నుంచి) కాపాడుకోవడానికి ఎకరాకు యూరియా 4 కిలోలు లేదా డీఏపీ 4 కిలోలు లేదా 13–0–45 ఎరువును 2 కిలోలు 200 లీటర్ల నీటిని కలుపుకొని పంటపై 15 రోజుల వ్యవధిలో పిచికారీ చేసుకోవాలన్నారు. శాస్త్రవేత్తలు రైతులతో ముఖాముఖీ నిర్వహించి సందేహాలను నివృత్తి చేశారు.

బాల్య వివాహాలను అరికట్టాలి



మాట్లాడుతున్న తహసీల్దార్‌ శ్రీనివాసులు

అవుకు: బాల్య వివాహాలను అరికట్టేందుకు అన్ని శాఖల అధికారులు సహకారం అందజేయాలని తహసీల్దార్‌ శ్రీనివాసులు, సీడీపీఓ రోజారాణి తెలిపారు. స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో వివిధ శాఖల అధికారులతో, సిబ్బందితో శనివారం వారు సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బాల్య వివాహాలు, నిరోధ చట్టాలపై ప్రతి గ్రామంలో అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. చిన్నతనంలోనే వివాహాలు చేయడం మూలంగా కలిగే దుష్పరిణామాలను ప్రజలకు వివరించి చైతన్యపరచాలని సూచించారు. అలాగే బాల్య వివాహాలను అరికట్టటానికి ప్రతి గ్రామంలోను ఒక కమిటీని ఏర్పాటు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జ్‌ ఎంపీడీఓ వెంకటేశ్వర్లు, ఎస్‌ఐ నరేంద్ర, ఎంఈఓ శ్రీధర్‌రావు, ఐసీడీఎస్‌ సూపర్‌వైజర్‌ శివమ్మ, అంగన్‌వాడీ సిబ్బంది పాల్గొన్నారు.

కల్యాణ మండప నిర్మాణానికి భూమి పూజ



యాగంటిలో టీటీడీ కల్యాణ మండప నిర్మాణానికి భూమి పూజ చేస్తున్న పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి దంపతులు

బనగానపల్లె: మండలంలోని పవిత్ర పుణ్య శైవక్షేత్రమైన యాగంటి ఉమామహేశ్వర దేవస్థానంలో నూతంగా నిర్మిస్తున్న టీటీడీ కళ్యాణ మండప నిర్మాణానికి స్థలదాత పాణ్యం ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి ఆయన సతీమణి కాటసాని ఉమామహేశ్వరమ్మ దంపతులు శనివారం భూమి పూజ చేశారు. అంతకు ముందు ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి కుటుంబ సమేతంగా ఉమామహేశ్వరులను దర్శించుకున్నారు. వీరికి ఆలయ ఈఓ చంద్రశేఖర్‌రెడ్డి చైర్మన్‌ తోట బుచ్చిరెడ్డి ఆలయ పూజారులు స్వాగతం పలికి సత్కరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే కాటసాని రాంభూపాల్‌రెడ్డి మాట్లాడుతూ ఉమామహేశ్వర నిత్యాన్నదాన సత్రం సేవా ట్రస్ట్‌ ద్వారా కల్యాణ మండప నిర్మాణానికి ఎకర స్థలంతో పాటు రూ.30లక్షల కాంట్రిబ్యూషన్‌ ఇవ్వడంతో టీటీడీ దేవస్థానం రూ.3 కోట్లు మంజూరు చేసిందన్నారు. ఏడాదిలోగ నిర్మాణ పనులు పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకోస్తామన్నారు. కార్యక్రమంలో ఎమ్మెల్యే కాటసాని తనయుడు కాటసాని శివనరసింహారెడ్డి ఆయన సతీమణి రూపశ్రీరెడ్డి, ఉమామహేశ్వరస్వామి నిత్యాన్నదాన సంస్థ ఉపాధ్యక్షుడు మల్కిరెడ్డి దస్తగిరిరెడ్డి, ప్రధాన కార్యదర్శి దొనపాటియాగంటిరెడ్డి, ట్రెజరర్‌ రామారెడ్డి, మహేశ్వరరెడ్డి, టీటీడీ డీఈఈ మన్మధరావు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా హనుమాన్‌ విగ్రహ ప్రతిష్ఠ



విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమంలో పాల్గొన్న కర్నూలు ఎమ్మెల్యే హఫీజ్‌ఖాన్‌, నాయకులు



ఆంజనేయస్వామికి పూజలు నిర్వహిస్తున్న ఎమ్మెల్యే శిల్పా చక్రపాణిరెడ్డి, ఏపీ ఐడీసీ చైర్‌పర్సన్‌ కర్రా గిరిజ

● ఎంపీ, ఎమ్మెల్యేల పూజలు

కోవెలకుంట్ల: పట్టణంలోని బనగానపల్లె చౌరస్తా క్రాస్‌ రోడ్‌లో శనివారం ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ ఘనంగా జరిగింది. మూడు రోజులపాటు నిర్వహించిన ఉత్సవాల్లో చివరి రోజు ప్రాత:కాలపూజ, యంత్ర అభిషేకం, యంత్ర ప్రతిష్ఠ, ఆవాహిత దేవతాహోమం, ప్రతిష్ఠహోమం, ఆంజనేయస్వామి విగ్రహ ప్రతిష్ఠ, కళాన్యాసము, కూష్మాంబలి, పూర్ణాహుతి, తదితర కార్యక్రమాలను భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. నంద్యాల ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి, శ్రీశైలం, కర్నూలు, ఆళ్లగడ్డ, నందికొట్కూరు ఎమ్మెల్యేలు శిల్పాచక్రపాణి రెడ్డి, హఫీజ్‌ఖాన్‌, గంగుల బిజేంద్రారెడ్డి(నాని), ఆర్థర్‌, ఏపీ ఇరిగేషన్‌ డెవలప్‌మెంట్‌ కార్పొరేషన్‌ చైర్‌పర్సన్‌ కర్రా గిరిజా హర్షవర్ధన్‌రెడ్డి, బనగానపల్లె ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి తనయుడు కాటసాని ఓబుళరెడ్డి, ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి సోదరుడు గిరిధర్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్రకార్యదర్శి కర్రా హర్షవర్ధన్‌రెడ్డి, అవుకు జెడ్పీటీసీ సభ్యురాలు చల్లా శ్రీలక్ష్మి, తదితరులు విగ్రహ ప్రతిష్ఠా మహోత్సవాలకు హాజరై ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

ఓటరు జాబితా తప్పులు లేకుండా తయారు చేయాలి



ఓటర్‌ జాబితా వెరిఫికేషన్‌ను పరిశీలిస్తున్న శ్రీనివాస్‌యాదవ్‌, కామేష్‌రావు

బనగానపల్లెరూరల్‌ : తప్పులులేని ఓటర్‌ జాబితాను తయారు చేయాలని బనగానపల్లె నియోజకవర్గ ప్రత్యేక అధికారి శ్రీనివాస్‌యాదవ్‌, ఈఆర్‌ఓ కామేష్‌రావు సూచించారు. స్థానిక తహసీల్దార్‌ కార్యాలయంలో శనివారం బనగానపల్లె, అవుకు, కోవెలకుంట్ల, సంజామల, కొలిమిగుండ్ల మండల తహసీల్దార్లతో ఓటర్ల వేరిఫికేషన్‌పై వారు సమీక్ష నిర్వహించారు. గతేడాది జనవరి 6 నుంచి ఈ ఏడాది మార్చి 31వ తేదీ మధ్యలో తొలగించబడిన ఓటర్ల వివరాలను మరోసారి ఇంటింటికి వెళ్లీ పరిశీలించాలని ఈ సందర్భంగా వారు సూచించారు. మరణించినా, గ్రామాల్లో లేనివారి పేర్లను తొలగించి అర్హత కలిగిన ప్రతిఒక్కరికీ ఓటు నమోదు చేయాలన్నారు. అనంతరం పట్టణంలో ముత్తుమియ్యా కాలనీలో జరుగుతున్న ఓటర్ల వేరిషికేషన్‌ను వారు పరిశీలించారు. ఓటర్ల వివరాలపై ఆరా తీశారు. కార్యక్రమంలో బనగానపల్లె, కోవెలకుంట్ల, అవుకు, కొలిమిగుండ్ల తహసీల్దార్లు వెంకటేశ్వర్లు, పుష్పావతి, శ్రీనివాసులు, ఆల్‌ఫ్రెడ్‌, ఆర్‌ఐ రాఘవేంద్ర, డిప్యూటీ తహసీల్దార్‌ కిశోర్‌కుమార్‌రెడ్డి, వీఆర్‌ఓలు, బీఎల్‌ఓలు తదితరులు పాల్గొన్నారు.